



స్వాగతం...సుస్వాగతం
మా ప్రియతమ నాయకుడు,
రాష్ట్ర విద్యా, ఐటీ శాఖామంత్రివర్యులు
గౌ॥శ్రీ నారా లోకేష్ గారికి
స్వాగతం...సుస్వాగతం..
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు, పార్వతీపురం నియోజకవర్గం



స్వాగతం..సుస్వాగతం
రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత
మొదటిసారిగా పార్వతీపురం జిల్లాకు విచ్చేయుచున్న
నవ్యాంధ్ర యువసారధి... తెలుగుదేశం పార్టీ
జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర విద్యా శాఖామంత్రి
శ్రీ నారా లోకేష్ గారికి
స్వాగతం.. సుస్వాగతం..
శ్రీ నారా లోకేష్ గారు
రాష్ట్ర విద్యా శాఖామంత్రి
తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు, పార్వతీపురం నియోజకవర్గం



ఏపీఈఏపీ ఫలితాలు విడుదల

విజయనగరం కలెక్టరేట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ (ఇంజనీ రింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించి జిల్లాలో 4,004 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 3,434 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 587 మంది, బాలికలు 2,847 మంది ఉన్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించి బాలురు 6,045 మంది, బాలికలు 4,704 మంది మొత్తం 10,749 మంది పరీక్ష రాశారు. వీరిలో బాలురు 4,401మంది, బాలికలు 3,524 మంది, మొత్తం 7,925 మంది ఉత్తీర్ణత సాధించారు.

మంత్రి లోకేశ్ పర్యటనకు సర్వం సిద్ధం

- నేడు పార్వతీపురం మన్యం జిల్లాకు రాక
- విద్యార్థులతో ముఖాముఖి
- టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మెరిసిన వారికి పురస్కారాల ప్రదానం
- చినబొండపల్లిలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పార్వతీపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మంత్రి లోకేశ్ జిల్లాకు వస్తుండడంతో ఘన స్వాగతం పలికేందుకు శ్రేణులు సర్వం సిద్ధం చేశారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా మూడోసారి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లోనూ ముందంజలోనే ఉంది. ఈ నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట మంత్రి పురస్కారాలు అందించనున్నారు. మన్యం జిల్లా నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులతో మంత్రి ముఖాముఖి నిర్వహిస్తారు. ఆ తర్వాత పార్వతీపురం మండలం చినబొండపల్లిలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించ నున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు గ్రామ కమిటీలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికారిక సభ్యులతో మాట్లాడనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఏడాది పాలనలో సాధించిన ఫలితాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వాటిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, భవిష్యత్‌లో ఏ ఎన్నికలు జరిగినా.. ఎలా సమాయత్తం అవ్వాలనే దానిపై మంత్రి చర్చిస్తారని సమాచారం. సాధారణ ఎన్నికల్లో కష్టపడి పార్టీను ముందుకు నడిపించిన ముఖ్య కార్యకర్తలకు లోకేశ్ చేతుల మీదుగా సత్కరించనున్నట్లు తెలిసింది. కాగా పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌తో పాటు చినబొండపల్లి వద్ద సభా వేదిక ఏర్పాట్లను ఎమ్మెల్యే విజయచంద్ర ఆదివారం పరిశీలించారు. మంత్రి పర్యటన విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఘన స్వాగతానికి సన్నాహాలు..

సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద మంత్రి లోకేశ్‌కు మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణలు ఘన స్వాగతం పలకనున్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

'ప్రతిభ'కు ప్రోత్సాహం

- నేడు విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

రాజాం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులకు గుడ్ న్యూస్. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు సోమవారం అందించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతికి సంబంధించి 182 మంది, ఇంటర్‌కు సంబంధించి 36 మందిని ఎంపిక చేశారు. మొత్తం 218 మంది విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున నగదు పురస్కారం అందించి ప్రశంసాపత్రంతో సత్కరించనున్నారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు, వారిలో పోటీతత్వాన్ని అలవరిచేందుకు ఇది మంచి కార్యక్రమం అని విద్యావేత్తలు, ఉపాధ్యాయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. జిల్లాలో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో ముత్యాలనాయుడు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత చేతుల మీదుగా అవార్డుల అందించనున్నట్లు చెప్పారు. నిబంధనలు అనుసరించి అత్యుత్తమ మార్కులు సాధించిన వారిని అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్




మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెంటాడకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు వ్యాపారులు సహకరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల రూ.39లక్షలతో 1.2కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు వేశామన్నారు. కానీ, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ఆక్రమణకు గురి కావడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు చేరి చెరువును తలపిస్తుందన్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మెంటాడ రోడ్డులో 40 అడుగుల వరకు ఆర్అండ్‌బీ అధికారులతో పాటు గ్రామ పంచాయతీ అధికారులు సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలన్నారు. రోడ్డుపై ఆక్రమణలు తొలగిస్తే పదేళ్ల వరకు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఆక్రమణల తొలగింపులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పూసర్ల మో హన్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఉప సర్పంచ్ మండల సురేష్ పాల్గొన్నారు.

ఖేదం.. మోదం

- ఇదీ బదిలీల్లో ఉపాధ్యాయుల పరిస్థితి
- కోరుకున్న పాఠశాలలు వచ్చిన వారిలో అమితానందం
- రానివారిలో నైరాశ్యం



బొబ్బిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి)

మరో నాలుగు రోజుల్లో బడులన్నీ తెరుచుకోనున్నాయి. ఏ ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి మాట్లాడుకున్నా ఒక్కటే మాట. 'ఫలానా స్కూలు మంచిదేనా? ఎంత దూరం ఉంటుంది? విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు మంచి వారేనా? హైస్కూల్‌లో పనిచేసిన స్థాయి నుంచి ఎస్‌జీటీగా వచ్చేస్తున్నాను. ఈ కొత్త స్కూలులో విద్యార్థుల సంఖ్యను కాపాడుకోకపోతే అక్కడ నుంచి మరో బడికి పంపించేస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఎలా ఆకట్టుకోవాలి? విద్యార్థుల సంఖ్యను ఎలా పెంచాలి. భవిష్యత్‌లో పాఠశాల మనుగడ, ఉద్యోగ స్థానంపై ఆందోళనగా ఉంది.' అంటూ ఉపాధ్యాయులు వారిలో వారు అనేక రకాలైన ఆసక్తిదాయకమైన చర్చలు జరుపుకొంటున్నారు.

● ఈ నెల 12న పాఠశాలలు తెరిచేలోగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను అధికారులు పూర్తి చేస్తుండడంతో నిబంధనల ప్రకారం గడువుమీరిన ఉపాధ్యాయులంతా కొత్తబడుల్లోకి అడుగుపెట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ఉపాధ్యాయులకు బదిలీ కౌన్సిలింగ్‌ను నిర్వహించి వారు ఎంచుకున్న పాఠశాలలకు కేటాయింపులు జరుపుతున్నారు. ఈ తతాంగమంతా కొందరి ఉపాధ్యాయులకు ఖేదాన్ని, మరికొంతమంది ఉపాధ్యాయులకు మోదాన్ని మిగుల్చుతోంది. రవాణాకు అనువుగా ఉంటూ నివాసప్రాంతాలకు చేరువగా ఉండే పాఠశాలలకు బదిలీ అయిన వారంతా అమితానందం పొందుతున్నారు. అందుకు భిన్నంగా దూర ప్రాంతాలకు, రవాణా సదుపాయం లేని గ్రామాలకు బదిలీఅయిన వారంతా మదనపడుతున్నారు.

● రేషనలైజేషన్‌లో భాగంగా పోస్టులు కోల్పోయిన వారు గతంలో పనిచేసిన సర్వీసుకు సంబంధించి పాయింట్లు అదనంగా దక్కించుకుంటున్నారు. ఇలా పాయింట్ల విషయంలో వెనుకబడిన వారంతా తమకు దక్కాల్సిన పాఠశాలల స్థానాన్ని మరొకరు తన్నుకు పోతున్నారన్న ఆవేదనతో కుంగి పోతున్నారు.

● ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను ఎస్‌జీటీలకు కాకుండా స్కూలు అసిస్టెంట్లకు కేటాయిస్తుండడంతో సంబంధిత ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. ఇన్నాళ్లూ స్కూల్ అసిస్టెంట్ల హోదాలో హైస్కూళ్లలో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు, ఇప్పుడు రేషనలైజేషన్ ప్రభావంగా ప్రాథమిక పాఠశాలల్లో బోధన చేయాల్సి రావడం ప్రాణ సంకటంగా తయారైంది. మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంతో ఎస్‌జీటీలలకు మోదంగా మారింది. అర్ధరాత్రి వరకు కౌన్సిలింగ్ నిర్వహించాల్సి రావడంతో అధికారులకు ఇబ్బందికరంగా మారింది.

● యూపీ స్కూళ్లలో 30 లోపు విద్యార్థులు ఉంటే రెండు, 30 దాటితే 4 చొప్పున స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వడంతో అలాంటి పోస్టుల స్థానాలను కోరుకునే వారు అభద్రతా భావానికి గురవుతున్నారు. రేష నలైజేషన్, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ విధానాల ప్రభావంతో ఆ పోస్టు కు ఎప్పుడు ఎసరు వస్తుందో నన్న ఆందోళన ఉపాధ్యాయ వర్గాల్లో నెలకొంది. ● మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసిన ప్రతీ తరగతికి ఒక టీచరు ఉండే వ్యవస్థ రూపుదాల్చుతోంది. అక్కడ పనిచేసే అవకాశం దక్కించుకున్న వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. అదే సమయంలో మండల పరిధిలో సుమారు సగం పాఠశాలల్లో విద్యార్థుల కొరత కారణంగా సింగిల్ టీచరు వ్యవస్థతో నెట్టుకురావాల్సి వస్తోంది. అలాంటి చోట పనిచేయాల్సిన దుస్థితి రావడాన్ని ఉపాధ్యాయులు ఓ శాపంగా భావిస్తున్నారు. ఒకే వ్యక్తి ఐదు తరగతులను బోధించడం కష్టసాధ్యం. పైగా అత్యవసర సమయాల్లో సెలవు పెట్టాలన్నా నానా తిప్పలు పడాల్సి వస్తుంది. అదే విధంగా హైస్కూళ్లలో గతంలో 1:40గా ఉండే ఉపాధ్యాయ-విద్యార్థుల నిష్పత్తిని 1:49 గా మార్చడంతో గందరగోళంగా తయారైంది.

అంతా గందరగోళమే..

ఉపాధ్యాయుల బదిలీ కోసం ఎవరూ కోరకపోయినా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టంతో కొత్తగా ఎవరికీ ఒరిగిందేమీ లేదు. అంతా గందరగోళంగా తయారైంది. బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియ ఉపాధ్యాయుల పాలిట పెద్ద సమస్యగా తయారైంది. బేసిక్ ప్రైమరీ స్కూళ్లు లేకుండా చేయ డం అన్యాయం. దీని కారణంగా ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గింది. హై స్కూళ్లలో రెండు మీడియంలను రద్దు చేయడంతో సుమారు 9 వేలకు పైగా పోస్టులు మిగులుగా చూపిస్తున్నారు. వీరందరినీ ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్ల ద్వారా ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు ప్రీవియస్ సర్వీస్ పాయింట్లు ఇవ్వకపోవడం వారికి నష్టదాయకమే. **-కె.విజయగౌరి, యూటీఎఫ్ నేత, బొబ్బిలి**

ఎస్‌జీటీలకు అన్యాయం..

ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను ఎస్‌టీలకు పదోన్నతి కల్పించి భర్తీ చేయడమే న్యాయం. అలాకాకుండా స్కూల్ అసిస్టెంట్లకు కట్టబెట్టడం వల్ల ఎస్‌జీటీలకు అన్యాయం జరుగుతుంది. విద్యాహక్కు చట్టం అమలు ప్రశ్నార్థకంగా తయారైంది. తొమ్మిది రకాల పాఠశాలలను తీసుకొస్తున్నా స్పందన కరువైంది. రెండు మీడియంలను అమలు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. మాతృభాష తెలుగును దూరం చేస్తున్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపాధ్యాయుల సమస్యను అందరికీ సానుకూలంగా పరిష్కరించడం లేదు.
-జేసీ రాజు, గంట సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘ నేతలు

అనుచిత వ్యాఖ్యలు తగవు
- సాక్షి మీడియాపై చర్యలు తీసుకోండి
- వివిధ పోలీస్‌స్టేషన్లలో మహిళల ఫిర్యాదు

8లో

ఒక్కరోజే గడువు

- నేటితో ముగియనున్న ఉద్యోగ బదిలీల ప్రక్రియ
- నిబంధనలు పాటించడం లేదంటున్న రెవెన్యూ, డీఆర్‌డీఏ ఉద్యోగులు

విజయనగరం కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో గత 25 రోజుల నుంచి బదిలీలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పని చేసే పలువురు ఉద్యోగులు కొత్త స్థానాలకు మారారు. ఈనెల 2తోనే బదిలీల ప్రక్రియ పూర్తి కావల్సి ఉన్నా ప్రభుత్వం ఈ నెల 9 (సోమవారం)వరకు గడువు పెంచింది. కాగా, రెవెన్యూ, డీఆర్‌డీఏలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు బదిలీలపై గుర్రుమంటున్నారు. బదిలీల్లో నిబంధనలు పక్కన పెట్టారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో డీఆర్‌డీఏలో 53మంది ఏపీఎంలు, 11 మంది డీపీఎంలు ఉన్నారు. అయితే, పోస్టుల సంఖ్యల తగ్గించడంతో జిల్లాలో 22 మంది ఏపీఎంలు, ఆరుగురు డీపీఎంలు అదనంగా ఉన్నారు. దీంతో వీరు ఈ నెల ఒకటో తేదీన విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో జరిగిన కౌన్సి లింగ్‌కు హాజరయ్యారు. వీరికి పోస్టులు ఎక్కడ కేటాస్తారు? అనేది తెలియాల్సి ఉంది. 16 మంది ఏపీఎంలలో ఇద్దరు అనకాపల్లి జిల్లాను, ఒకరు అల్లూరుసీతారామరాజు జిల్లాను, 9 మంది కాకినాడ, మిగతా నలుగురు తూర్పుగోదావరి జిల్లాను కోరుకున్నారు. అయితే ఏపీఎంలను జోన్ పరిధిలో మాత్రమే బదిలీ చేయాలని జీవోలో పొందుపరిచినా, ఇప్పుడు జోన్ పరిధి దాటి బదిలీ చేయడంపై వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆ శాఖలో గందరగోళం నెలకొంది.

● రెవెన్యూ శాఖకు సంబంధించి ఎస్.కోట, నెల్లిమర్ల, రాజాం నియోజకవర్గాల్లో పని చేసిన ఉద్యోగులకు మాత్రమే బదిలీలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. తమను ఎందుకు బదిలీ చేశారో? తెలియడం లేదని ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన కొంతమంది వీఆర్వోలు గగ్గోలు పెడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి. కొందరు వీర్వోలను సొంత జిల్లాకు కాకుండా పక్క జిల్లా పార్వతీపురం మన్యంకు మార్చడంపై మదన పడుతున్నారు. కొందరు దరఖాస్తు చేసుకోకపోయినా? ఒకేచోట ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి కాకపోయినా వారిని బదిలీ చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ గ్రేడ్-1 నుంచి 4 వరకూ పని చేసే కార్యదర్శుల బదిలీల్లో సిఫారసులకు పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా బదిలీలకు ఒక్కరోజే గడువు ఉండడంతో ఎంతమంది కొత్త స్థానాలకు వెళ్తారో? చూడాలి.

డీసీసీబీ, డీసీఎంఎస్ పీఐసీలుగా
నాగార్జున, కృష్ణ బాధ్యతల స్వీకరణ



డీసీసీబీ పీఐసీగా ప్రమాణం చేస్తున్న కిమిడి నాగార్జున



డీసీఎంఎస్ పీఐసీగా బాధ్యతలు చేపడుతున్న గొంప కృష్ణ

విజయనగరం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా మార్కెటింగ్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌చార్జిలుగా(పీఐసీ) టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎస్.కోటకు చెందిన టీడీపీ నేత గొంప కృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. డీసీసీబీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, ప్రజాస్వామ్య విధానాలు అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు మాట్లాడుతూ.. గత 40 ఏళ్లగా టీడీపీ కళా కుటుంబానికి మంచి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. కష్టసమయంలో ఉమ్మడి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నాగార్జున మంచి సేవలు అందించారన్నారు. తాజాగా డీసీసీబీ పీఐసీగా బాధ్యతలు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. డీసీసీబీని ప్రక్షాళన చేసి, అందరికీ ఉపయోగపడేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. తొలుత డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు కిమిడి నాగార్జునతో ప్రమాణం చేయించారు. అనంతరం జరిగే కార్యక్రమానికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు అధ్యక్షత వహించారు. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ సేవలు మరింత విస్తృతం చేసి, ఈ సంస్థను ఆదాయం బాట పట్టిస్తానని, ఇందుకు అందరూ సహకరించాలని డీసీఎంఎస్ పీఐసీ గొంప కృష్ణ కోరారు. నాగార్జున అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు చీపురుపల్లిలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, కోండ్రు మురళీమోహన్, బేబినాయన, అదితి గజపతిరాజు, బోనేల విజయచంద్ర, లోకం నాగమాధవి, నిమ్మక జయకృష్ణ, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పీ భంజ్‌దేవ్, కిమిడి గణపతిరావు, తెంటు లక్ష్మునాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, ఆర్.పావనీ, జనసేన నేత గురాన అయ్యలు, అవనాపు విక్రమ్ తదితరులు నాగార్జున, కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

వేపాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వేపాడలోని వల్లంపూడి పోలీస్ స్టేషన్ ముందు ఆదివారం ఓ మహిళ పెట్రోల్‌ను ఒంటి మీద పోసుకుని, నిప్పటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి మంటలను ఆర్పేశారు. గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. స్థానికులు, పోలీసుల వివరాలు మేరకు.. ఎస్.కోట మండలం కాపుసోంపురం గ్రామానికి చెందిన రొంగలి లక్ష్మి (25)అనే మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆ యువకుడికి కూడా పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై ఆ యువకుడి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతను లక్ష్మిని దూరం పెట్టాడు. దీనిపై లక్ష్మి ఇటీవల వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సుదర్శన్ ఇరువర్గాలను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు స్టేషన్‌కు పిలిపించారు. వారి కుల పెద్దల సమక్షంలో మాట్లాడి రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించారు. కానీ, లక్ష్మి వినలేదు. 'ఆ యువకుడిని నావద్ద మూడు రోజులు, ఆయన భార్య వద్ద మూడు రోజులు ఉండమని చెప్పండి. అలాగైతే నేను ఒప్పుకుంటా. లేదంటే కుదరదు.'అని చెప్పింది. దీనికి ఆ యువకుడి కుటుంబం అంగీకరించలేదు. ఎవరి కుటుంబంతో వారు ఉండడం శ్రేయస్కరమని పెద్దలు కూడా సలహా ఇచ్చారు. దీనికి అంగీకరించని లక్ష్మి ఆగ్రహంతో స్టేషన్ నుంచి బయటకు వెళ్లిపోయి, రోడ్డుపై ఉన్న ఓ షాపులో పెట్రోల్ కొనుగోలు చేసుకుని వచ్చింది. పోలీసు స్టేషన్ ఎదురుగా తన శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. అక్కడే ఉన్న స్థానికులు, ఇద్దరు కానిస్టేబుళ్లు గమనించి వెంటనే సమీపంలో ఉన్న దుప్పటి, గోనె సంచులను లక్ష్మిపై కప్పి మంటలను ఆర్పారు. అనంతరం 108కి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం లక్ష్మిని శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



108 వాహనంలో లక్ష్మిని ఎస్.కోట ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అనుచిత వ్యాఖ్యలు తగవు

● సాక్షి మీడియాపై చర్యలు తీసుకోండి

● వివిధ పోలీస్‌స్టేషన్లలో మహిళల ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి బృందం)

అమరావతి మహిళలపై సాక్షి మీడియా జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని జిల్లాలోని మహిళలు ఖండించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.


గజపతినగరంలో..


నెల్లిమర్లలో..


విజయనగరంలో..


రాజాంలో..


బొబ్బిలిలో..


చీపురుపల్లిలో..

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న గురాన, కడగల

విజయనగరం దాసన్నపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండల పరిధిలోని ద్వారపూడిలో మహాగణపతి, సూర్యనారాయణ, సీతారాముల ఆలయ నిర్మాణానికి జనసేన నాయకుడు గురాన అయ్యలు, టీడీపీ నాయకుడు కడగల ఆనంద్‌కుమార్ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు, కడగల ఆనంద కుమార్‌లను కమిటీ ప్రతినిధులు అభినందించారు.

రామాలయానికి రూ.50వేలు


విరాళం అందజేస్తున్న చనమల్లు

నెల్లిమర్ల, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్లపేట రామాలయానికి జనసేన నాయకుడు, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఆదివారం జరిగిన ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని విరాళాన్ని కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జమ్ము రమణ, చనమల్లు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా యోగాపై దివ్యాంగుల ప్రచారం


ప్రచారం చేస్తున్న దివ్యాంగులు

భోగాపురం, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగాపురం గ్రామానికి చెందిన మారుతీ దివ్యాంగుల సంఘం ప్రతినిధులు ఆదివారం యోగాపై ప్రచారం నిర్వహించారు. భోగాపురం, ముంజేరు, ముక్కాం గ్రామాల్లో మూడు చక్రాల సైకిళ్లపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రామిశెట్టి చిన్నారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి రూ.లక్ష ఆర్థిక సాయం


స్వామికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

గరివిడి, జూన్8 (ఆంధ్రజ్యోతి): గరివిడికి చెందిన కళాకారుడు కె.కె.ఎల్.స్వామికి ఆదివారం ఫేకర్ ఎంప్లాయిస్ యూనియన్ వ్యవస్థాపకుడు ఎం.జగన్నాథరాజు రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. గరివిడిలో ఎంతోమంది కళాకారులకు స్వామి ఇచ్చారు. ఇటీవల గరివిడిలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకాల పోటీల నిర్వహణకు ఎంతో కృషి చేశారు. అయితే స్వామి ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విరాళాల ద్వారా సేకరించిన రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కింతాడ రవి పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం


సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

నెల్లిమర్ల, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్లపేటలో రామాలయ ప్రారంభోత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాములకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, చనమల్లు స్వాతి, గోవిందరావు, జమ్ము వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు తదితరులు సీతారాములను దర్శించుకున్నారు.

దుర్గమ్మ ఆలయానికి నాగార్జున


పూజలు నిర్వహిస్తున్న నాగార్జున

గుర్ల, జూన్8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున ఆదివారం గుర్లలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా విజయనగరం బయలుదేరారు.

● చీపురుపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారానికి ఆదివారం ఉదయం బయలుదేరిన కిమిడి నాగార్జునతో కలిసి పార్టీ కార్యకర్తలు, నాగార్జున అభిమానులు విజయనగరం తరలివెళ్లారు. నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఊరేగింపుగా విజయనగరం వెళ్లారు. అంతకుముందు నాగార్జున పట్టణంలోని కోటదుర్గ, గుర్లలోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు చేశారు.

అమ్మవారికి డీసీఎంఎస్ చైర్మన్ పూజలు


అమ్మవారి ఆలయంలో గొంప కృష్ణ

శృంగవరపుకోట, జూన్8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలోని దుర్గమ్మ ఆలయంలో ఆదివారం డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణకు ముందు ఇక్కడ నుంచి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఇందుకూరి శ్రీనిరాజు తదితరులున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం


విగ్రహ ప్రతిష్ఠ పూజలో అప్పలరాజు దంపతులు

విజయనగరం దాసన్నపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గుంటూరువారి వీధి బృందావన్ అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం గణపతి, రాధాకృష్ణ సమేత షిర్డీసాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంచుకొండ అప్పలరాజు దంపతులు విగ్రహ ప్రాణప్రతిష్ఠలో పాల్గొన్నారు. అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీజీ ఈశ్వరరావు, ఎస్‌కెఎం బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

దత్తిరాజేరు, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరడాంలో షిర్డీసాయినాథుడి ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గతంలో షిర్డీసాయి ఆలయాన్ని గుగ్గిలాపు వెంకటరావు, రాజేశ్వరమ్మ దంపతులు నిర్మించారు. అయితే జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఆలయాన్ని కూల్చేశారు. ప్రస్తుతం వెంకటరావు సోదరులు నర్సింగరావు, నారాయణరావు, గంట బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రవి గురుస్వామి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

అసిరితల్లి ఆలయ ప్రారంభోత్సవం

సంతకవిటి, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరినాయుడుపేటలో నిర్మించిన గ్రామదేవత నీలమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు.

అక్కసుతోనే అనుచిత వ్యాఖ్యలు

రాజాం/వంగర జూన్8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై అక్కసుతో సాక్షి ఛానల్‌లో కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు లచ్చుభుక్త ధనలక్ష్మి ఖండించారు. ఆదివారం ఆమె పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అమరావతి మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పోరాట ఫలితమే వర్గీకరణ

రాజాం, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అని జిల్లా ఇన్‌చార్జి రానా శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఆదివారం స్థానిక మాదిగ వీధిలో బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యందవ నారాయణరావు మాదిగ, ఎంఈఎస్ అధ్యక్షుడు అరసాడ ఆనందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యందవ రవికుమార్ పాల్గొన్నారు.

దేవునికణపాకలో కార్డెన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

విజయనగరం క్రైం/ గుర్ల జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని దేవునికణపాకలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. గ్రామ శివార్లలో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రికార్డులు సరిగ్గా లేని ఆరు మోటార్ సైకిళ్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వేకువ జామున 5 గంటలకు చీపురుపల్లి సీఐ రాఘవులు, ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్‌లో ఎస్ఐలు శ్రీనివాస్,నారాయణరావు, లోకేశ్వరరావు, పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో మందుబాబులపై దాడి


మందుబాబులను పట్టుకున్న పోలీసులు

విజయనగరం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్టు ఆదివారం పోలీసులు డ్రోన్ సాయంతో గుర్తించారు. దాంతో వారిపై దాడులు నిర్వహించారు. మందుబాబులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం వన్ టౌన్, టూటౌన్‌కి వచ్చిన సమాచారం మేరకు పూల్‌బాగ్ కాలనీ, నందిగుడ్డి ప్రాంతం, కణపాక, అయ్యన్నపేట ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్‌తో నిఘా పెట్టామన్నారు. మందుబాబులను గుర్తించి 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నేర నియంత్రణ, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణకు డ్రోన్స్ వినియోగించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు.

గ్రావెల్ అక్రమ రవాణా


ట్రాక్టర్‌తో గ్రావెల్‌ను తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రోత్ సెంటర్‌కు సమీపంలో ఉన్న నారాయణప్పవలస, మల్లమ్మపేట తదితర గ్రామాల్లోని చెరువుల నుంచి గ్రావెల్‌ను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ఈ గ్రావెల్‌ను ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో మూతపడిన ఓ పరిశ్రమ ఆవరణలో నిల్వ చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 500 లోడ్లను నిల్వ చేశారు. ఎవరికైనా అవసరమైనప్పుడు, మంచి బేరం కుదిరినప్పుడు ప్రభుత్వ సెలవు దినాల్లో గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ ఎం.శ్రీనును వివరణ కోరగా.. 'గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలిచ్చాం. యంత్రాలను సీజ్ చేస్తాం' అని తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

బొబ్బిలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. బొబ్బిలి మండల పరిషత్ సమావేశ భవనంలో ఆదివారం సీనియర్ సిటిజన్లకు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. యోగా గురువు ఎం.ఈశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డీడీవో ఎం.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్ తదితురులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

బొబ్బిలి జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. పారా స్పోర్ట్స్‌కు సంబంధించిన చైతన్య యాత్ర బొబ్బిలి చేరుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. దివ్యాంగుల్లో క్రీడా ప్రతిభను గుర్తించి, వారు మరింత రాణించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శి చీమల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

బొబ్బిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. జూనియర్స్ విభాగంలో గౌతమి, సంజన, సోమేశ్‌యాదవ్, శివరామకృష్ణ, సీనియర్స్ విభాగంలో అభినవ్, కిశోర్‌కుమార్, రోహిత్, కిరణ్‌లు ఎంపికైనట్లు చెప్పారు.

వెబ్ కౌన్సెలింగ్ సమంజసం కాదు

రామభద్రపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బదిలీలకు సంబంధించి ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ కాకుండా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం సమంజసం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. రామభద్రపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్‌లో చోటు చేసుకున్న అసంబద్ధాలను విద్యాశాఖ తక్షణమే సరిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మక్క సాయిబాబనాయుడుకు పరామర్శ


పరామర్శిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని

రాజాం, జూన్8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన తూర్పుకాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మక్క సాయిబాబనాయుడును జనసేన నాయకులు ఆదివారం పరామర్శించారు. జి.సిగడాం మండలం పెంట గ్రామానికి వెళ్లి ఆయన బాగోగులు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సాయిబాబనాయుడును పరామర్శించిన వారిలో తూర్పుకాపు జాతీయ అధ్యక్షుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, పొగిరి సురేష్‌బాబు, భూపతి అర్జున్, మక్క అంజి, గిరిబాబు, కాంతారావు, సత్యనారాయణ, గార గురినాయుడు, కోనారి సత్యనారాయణ పాల్గొన్నారు.

వెల్దాంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పెంటారావు

వేపాడ, జూన్8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రచనతో సమ సమాజ స్థాపనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాల్తేటి పెంటారావు అన్నారు. మండలంలోని వీలుపర్తి పంచాయతీ వెల్దాంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అసమానతలను రూపుమాపడానికి, బడుగు బలహీనవర్గాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం కల్పించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో విశాఖ భీమ్‌సేన వ్యవస్థాపకుడు రవిసిద్ధార్థ్, బీసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నక్కెల నాగమణి, మండల మాల మహానాడు నాయకుడు దేబారికి కిరణ్, సర్పంచ్ శానాపతి లీల, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక..

● గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

శృంగవరపుకోట రూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన సాయికుమార్ (26) గడ్డి మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ నారాయణమూర్తి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సాయికుమార్ కొద్దికాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అయితే ఈ నెల 2న తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగేశాడు. విషయం గమనించిన తండ్రి వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం రెండు రోజుల కొందట ఇంటికి వచ్చాడు. మరోసారి ఆది వారం ఉదయం సాయికుమార్‌కు ఆరోగ్యం బాగులేకపోవడంతో ఎస్.కోట ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని సీఐ తెలిపారు. తండ్రి సేనాపతి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గంజాయితో ఇద్దరి యువకుల అరెస్టు

శృంగవరపుకోట రూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర చెక్ పోస్టు వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు విశాఖపట్నం యువకులను ఆదివారం అరెస్ట్ చేసినట్టు సీఐ నారాయణమూర్తి తెలిపారు. విశాఖకు చెందిన ఎస్.ఆశిష్‌కుమార్, ఎం.లిఖిత్.. అరకు నుంచి 1.810 కేజీల గంజాయిని స్కూటీలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు.. పోలీసుల అదుపులో నిందితుడు


మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన నిందితుడిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమౌళి ఆ వివరాలను వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భామిని మండలం సొలికిరి గ్రామానికి చెందిన జామి వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వెంకటేశ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నారు. తన స్నేహితుడు పోస్టు చేసిన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వీడియోకు.. వెంకటేశ్ అమానుష రీతిలో కామెంట్ చేశాడని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవికుమార్ ఈనెల 2న ఫిర్యాదు చేశారన్నారు. దాంతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఆధారంగా నిందితుడి ఐపీ అడ్రస్ కనుగొన్నామన్నారు. కాల్ డేటాల ద్వారా విశాఖపట్నంలోని పెందుర్తి ప్రాంతంలో అదుపులోకి తీసుకుని పాలకొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు.

మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించాలి


కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట ఆదివారం ఆందోళన చేపట్టారు. న్యాయమైన సమస్య పరిష్కరించే వరకూ కదిలేది లేదన్నారు. ఉపాధ్యాయులు ఆదివారం డీఈవో కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తుండగా కలెక్టరేట్ గేట్లు మూసేశారు. దీంతో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ప్రభుత్వం దిగి వచ్చేవరకూ కౌన్సెలింగ్‌లో పాల్గొనేది లేదని హెచ్చరించారు. ఉపాధ్యాయులతో ఆడుకోవాలని చూస్తే గుణపాఠం చెబుతునామన్నారు. అనంతరం ఒంటి గంట సమయంలో కలెక్టరేట్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో బదిలీలు నిర్వహించడం వల్ల ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిసి ముందుగా ఇచ్చిన ఆప్షన్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వైబ్ సైట్‌లో తప్పనిసరి బదిలీగా చూపడంతో ఆప్షన్ ఇచ్చుకోలేక పోయారన్నారు. తుది సీనియార్టీ జాబితాలను విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండా ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలామంది నష్టపోయారన్నారు. ఆందోళనలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మురళీమోహన్, కె.శ్రీనివాసరావు, జేఏవీఆర్ ఈశ్వరరావు, రమేష్‌చంద్ర పట్నాయక్, రాము, విజయగౌరి, రవీంద్రనాయుడు, శ్రీనివాసరావు, బంకపల్లి శివప్రసాద్, శ్యామ్, జోగారావు, సూరిబాబు, ఈశ్వరరావు, పైడిరాజు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

చీపురుపల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.ములగాంలో చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదరరావు ఆదివారం దాడులు నిర్వహించారు. తవిటి నాయుడు నుంచి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.